నాన్‌స్టాప్ దోపిడీ


డిపోలో ఉన్న ఆర్టీసీ బస్సులు

- ఆపసోపాలు పడుతున్న మహిళలు
- సకాలంలో బస్సులు అందక అవస్థల్లో విద్యార్థులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ అధికారులు తమ రూటే సపరేటు అంటూ ముందుకు సాగిపోతున్నారు. రాష్ట్రమంతా ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో ప్రయాణికులను ఆకట్టుకుంటున్నా.. ఇక్కడి అధికారులు మాత్రం భక్షులు, ప్రయాణికులను దోచుకునే పనిలో నిమగ్నమయ్యారు. నాన్‌స్టాప్, అల్ట్రా డీలక్స్, మెట్రో సర్వీసుల పేరుతో నిలువుదోపిడీ చేస్తున్నారు. నామమాత్రంగా పల్లెవెలుగు సర్వీసులు తిప్పుతూ ప్రయాణికులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. సకాలంలో తరగతులకు హాజరుకాలేక విద్యార్థులు అవస్థలు పడుతుంటే.. కూటమి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకం నిర్వీర్యం కావడంపై పెదవి విరుస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇక్కడి కూటమి నాయకులు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

ఒక్క ఎక్స్‌ప్రెస్ సర్వీసు లేదు

శ్రీకాళహస్తి డిపోలో మొత్తం 119 సర్వీసులు ఉన్నాయి. ఇందులో 39 సర్వీసులు మాత్రమే పల్లెవెలుగు కింద తిప్పుతున్నారు. మిగిలినవి నాన్‌స్టాప్ సర్వీసులు. ఒక్క ఎక్స్‌ప్రెస్ సర్వీసు కూడా లేదు. పక్క నియోజకవర్గమైన సూళ్లూరుపేట డిపోలో మొత్తం 30 సర్వీసులుండగా అందులో 28 సర్వీసులు ఎక్స్‌ప్రెస్‌వే. కానీ ఇక్కడి అధికారులు రద్దీని బట్టి పల్లెవెలుగు సర్వీసులను కూడా స్పెషల్ సర్వీసుల పేరుతో నాన్‌స్టాప్ బోర్డులు పెట్టేస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిర్వీర్యం అవుతున్న 'స్త్రీశక్తి'

శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో స్త్రీశక్తి పథకం నిర్వీర్యం అవుతోంది. కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పేరుతో ఉచిత బస్సు సర్వీసులకు శ్రీకారం చుట్టింది. ఇందులో పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితమని ప్రకటించింది. కానీ ఇక్కడ ఒక్క ఎక్స్‌ప్రెస్ సర్వీసు కూడా లేదు. మొదలే టెంపుల్ సిటీ కావడంతో ఉన్న అరకొర పల్లెవెలుగు సర్వీసులు బస్టాండులోనే కిక్కిరిసిపోతున్నాయి. చెయ్యెత్తినా ఎక్కడా ఆపని పరిస్థితి. విధిలేని పరిస్థితుల్లో ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపైనే పడిగాపులు కాయాల్సిన దుస్థితి. విద్యార్థులు, మహిళల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది.

నాన్‌స్టాప్

శ్రీకాళహస్తి డిపో పరిధిలోని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల తీరు రోజురోజుకీ తీసికట్టుగా మారుతోంది. బస్టాండ్ నుంచి బయల్దేరిన బస్సు రద్దీ, ట్రాఫిక్ పేరుతో ప్రస్తుతం ఆలయం వద్ద నుంచి పొన్నాలమ్మగుడి, ఏపీసీడ్స్ సర్కిల్, హౌసింగ్ బోర్డు, మిట్టకండ్రిగ మీదుగా తిరుపతి వెళ్తున్నాయి. అయితే బస్సు ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులు ఆపుతున్నా అప్పటికే రద్దీగా ఉండడంతో నామమాత్రంగా నిలుపుతూ వెళ్లిపోతున్నారు. చెయ్యెత్తినా.. గొంతెత్తి మొత్తుకుంటున్నా వినిపించుకోవడం లేదు. ఎవరైనా అడిగితే ఛీదరించుకుంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. సీజనల్ పాస్‌లు, జర్నలిస్ట్ పాసులున్న వారిని అదోరకంగా చూస్తూ వేధిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇక సూళ్లూరుపేట, గూడూరు, వాకాడు, నెల్లూరు డిపోల సర్వీసులు బస్టాండ్‌లో తప్ప మరెక్కడా ఆపకుండా వెళ్తుండడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పడం లేదు.

దోచుకోవడమే పని

శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి 35 కి.మీ దూరం. ఈ కొంచెం దూరానికే నాన్‌స్టాప్ సర్వీసుల్లో రూ.65, అల్ట్రా పల్లెవెలుగులో రూ.75 వరకు వసూలు చేస్తున్నారు. పల్లెవెలుగు సర్వీసులు అంతంతమాత్రంగా ఉండడంతో ప్రయాణికులు వీటినే ఆశ్రయిస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

ఉచిత బస్సు ఉద్యోగులకు శాపం

నాన్ స్టాప్ లు మహిళలు ఉంటే ఆగకుండా వెళ్లిపోతున్నాయి. కొందరు ఉద్యోగులు టికెట్ తీసుకుంటామంటున్నా ఉచిత బస్సు కోసం వెయిట్ చేస్తున్నారని నాన్ స్టాపులు ఆగకుండా వెళ్లిపోవడం ఉద్యోగులు అయోమయంలో పడుతున్నారు.

పట్టించుకోని కూటమి నేతలు

ప్రయాణికులకు బాసటగా నిలవాల్సిన కూటమి నేతలు వారి అవస్థలవైపు కన్నెత్తి చూడడం లేదు. శ్రీకాళహస్తి డిపో పరిధిలో ఒక్క ఎక్స్‌ప్రెస్ సర్వీసు లేకున్నా స్పందించడం లేదు. సంబంధిత రవాణాశాఖ మంత్రితో మాట్లాడి రద్దీకి తగ్గట్టుగా కొత్త సర్వీసులు ఏర్పాటు చేయాల్సి ఉండగా తమకెందుకులే అనుకుని మిన్నకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది. రద్దీ నేపథ్యంలో ఇక్కడి అధికారుల తీరుపైనా విమర్శలు వస్తున్నాయి. వారిని దారిలో పెట్టాల్సిన సంబంధిత అధికారులు కూడా శ్రీకాళహస్తి అంటేనే చిన్నచూపు చూస్తున్నారని పలువురు నిట్టూర్పులు వెళ్లగక్కుతున్నారు.

క్లుప్తంగా

కన్యకాపరమేశ్వరి సేవలో మాజీ ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధ్యక్షుడు జూలుగంటి మురళీమోహన్‌గుప్తా, గౌరవాధ్యక్షుడు ఎంఆర్‌పీ సురేంద్రబాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. అర్చకులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంబరాల్లో సముదాయం

నారాయణవనం: జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ జూనియర్ విభాగంలో రెండు కాంస్య పతకాలను యధార్థ్ బుడమల సాధించడంతో మండలంలోని సముదాయం గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. గ్రామవాసి గంగాధర్ ఉపాధి కోసం ముంబయి వెళ్లి స్థిరపడ్డాడు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అతని కుమారుడు యధార్థ్ బుడమల జూనియర్ కిక్ బాక్సింగ్ జాతీయ స్థాయి పోటీల్లో రెండు కాంస్య పతకాలను సాధించాడు. ఈ నేపథ్యంలో సముదాయంలోని గంగాధర్ బంధువులు ఆనందంతో స్వీట్లను పంచిపెట్టారు.

ఎస్‌ఐకి సన్మానం


ఎస్‌ఐ విశ్వనాథనాయుడును సన్మానిస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న ఎస్‌ఐ విశ్వనాథనాయుడును ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నేత ఆరణి సుధాకర్‌రెడ్డి, ఆ పార్టీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌ఐ విశ్వనాథనాయుడు పార్టీలకు అతీతంగా సేవలందించారని, ఆయన సేవలను మరువలేమని, పోలీసు వ్యవస్థలో అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు.

విద్యతో ఉన్నత లక్ష్యాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: విద్యతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ప్రగతి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త చంద్రశేఖర్ అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఎర్రంరెడ్డిపల్లి, ఓబులాయపల్లిలో ఆదివారం ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని కరపత్రాలను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ఫొటోలతో ఉండాలి


సత్యవేడులో నిరసన ర్యాలీ

సత్యవేడు: ఓటర్ల జాబితాను స్పష్టమైన ఫొటోలతో ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవంబాబు కోరారు. ఆదివారం సత్యవేడులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘునాథ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటర్ల జాబితా అవకతవకలపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు బాలగురవంబాబు మాట్లాడుతూ ప్రజల ఓట్లను దోచుకుని మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. గాంధీ రోడ్డు నుంచి నేతాజీ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. బాలరాజు, తడబాబు, మాణిక్యం, ఇళయరాజా, అంబేద్కర్, భాస్కర్, శ్రీనివాస గౌడ్, షణ్ముగం, ఏ.భాస్కర్, తమిళరసన్, మనిగండన్ పాల్గొన్నారు.

కాంబాకం మాజీ సర్పంచ్ మృతి


జయచంద్రారెడ్డి

వరదయ్యపాళెం: కాంబాకం పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్, ఆయకట్టు ప్రెసిడెంట్ ఉగ్గుమూడి జయచంద్రారెడ్డి ఆదివారం ఉదయం అకాల మరణం చెందారు. ఆయన మృతిపై పంచాయతీ ప్రజలు, మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నేతలు

- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ శ్రేణులకు డిజిటల్ బుక్ అండ అని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ శ్రేణులతో సమావేశం జరిగింది. సమావేశంలో కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్‌ను బియ్యపు మధుసూదన్‌రెడ్డి కార్యకర్తల సమక్షంలో క్యూఆర్ కోడ్‌ను ప్రారంభించారు. బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా 257 అక్రమ కేసులు నమోదయ్యాయన్నారు. ఈ అక్రమ కేసులన్నింటికీ 2029 సంవత్సరంలో వచ్చే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారం ఉంటుంది కాబట్టి ఏ ఒక్క కార్యకర్త, నాయకుడికి అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందో తిరిగి వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులకు న్యాయం జరిగే విధంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దీనిని ఏర్పాటు చేశారని చెప్పారు. డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌ను పార్టీ శ్రేణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు డిజిట్ బుక్ అండగా ఉంటుందన్నారు. వయ్యాల కృష్ణారెడ్డి, కోగిల సుబ్రహ్మణ్యం, చెవిరెడ్డి మధురెడ్డి, శివయాదవ్, పగడాలరాజు, సూరా సురేష్, ఉత్తరాది శరవణకుమార్, కంఠ ఉదయ్‌కుమార్, సిరాజ్ బాషా, పఠాన్ ఫరీద్, మున్నా రాయల్, డాక్టర్ శంకర్, పసల కృష్ణయ్య, కొత్తపాటి శ్రీనివాసులురెడ్డి, వయ్యాల మనోహర్ రెడ్డి, పసల సుమతి, మునిరత్నంరెడ్డి, మునికృష్ణారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, జయకష్టారెడ్డి, జీవీకే రెడ్డి, ఏర్పేడు శివయ్య పాల్గొన్నారు.

వ్యాయామంతో గుండె పదిలం


3కే రన్ ప్రారంభిస్తున్న ఆర్డీఓ, ఎంజీఎం డైరెక్టర్

శ్రీకాళహస్తి: వ్యాయామంతో గుండె ఆరోగ్యంగా ఉంటుందని శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. 29న ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో 3కే రన్ జరిగింది. ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యాయామం కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. దీంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో గుండె సంబంధించి ఓపీ పూర్తిగా ఉచితమని 28, 29, 30వ తేదీల్లో 50శాతం రాయితీతో ఈసీజీ, 2డీ, వంటి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పురపాలకసంఘ కమిషనర్ భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.


3కే రన్‌లో పాల్గొన్న ప్రజలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సత్యవేడు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1986–87 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 38 సంవత్సరాల తర్వాత మిత్రులంతా కలుసుకుని సరదాగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులైన పరంధామశెట్టి, వసంతమ్మలను సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాజీ విద్యార్థులలో ఒకరైన సత్యవేడు నియోజవర్గ పార్టీ వ్యవహారాల కో–ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి పాల్గొని, తన మిత్రులతో సరదాగా గడిపారు. మిత్రులతో గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. పాఠశాల ప్రహరీ గోడ, గేటును తన సొంత నిధులతో నిర్మించి ఇస్తామని తెలిపారు.

కళాసృష్టి సంస్థకు అవార్డు


సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న దశరథాచారి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తికి చెందిన కళాసృష్టి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డును అందజేసింది. శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన పర్యాటక దినోత్సవ సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా సంస్థ అధ్యక్షుడు దశరథాచారి అవార్డు అందుకున్నారు. కళలు, సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాపితం చేయడం ద్వారా రాష్ట్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో విశిష్ట స్థానం కలిగిన కళారంగానికి చెందిన కాయబొమ్మల కళాకారుడు డాక్టర్ జి. దశరథాచారి 2024–25 సంవత్సరానికిగాను ఆంధ్రప్రదేశ్ వార్షిక ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు.

ముగిసిన అంకాళమ్మ పరమేశ్వరి జాతర



గరిగను ఊరేగిస్తున్న గ్రామస్తులు, అమ్మవారి ఊరేగింపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్.అనంతాపురం గ్రామంలోని శ్రీఅంకాళమ్మ పరమేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. జాతర బ్రహోత్సవాల్లో శ్రీఅంకాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి, గ్రామంలో ఊరేగించారు. గ్రామ పొంగళ్లు, అమ్మవారి దిష్టి తీర్పడంకుంభాలు వేయడం తదితర కార్యక్రమాలు జరిగాయి. శ్రీఅంకాళమ్మ పరమేశ్వరి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి, పూలతో అలంకరించారు. అనంతరం గ్రామస్తులు ఎదురు పొంగళ్లు పెట్టి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి, అంబళ్లు తీసుకొచ్చి భక్తులకు పంపిణీ చేశారు. జాతరతో బంధువులు రావడంతో గ్రామం కళకళలాడింది. జాతరకు హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

మహాచండీ దేవి.. పాహిమాం





మహాచండీదేవిగా కాళికాదేవి, శివపార్వతీగా ద్రౌపదీ అమ్మవారు, కాళికాదేవిగా సర్వమంగళాదేవి, బొమ్మలకొలువులో అమ్మవారు

శ్రీకాళహస్తి: దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఆదివారం వివిధ రూపాల్లో ఆయా ఆలయాల్లోకొలువైన అమ్మవార్లు భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తి రక్తబీజాక్షరి, బండాసుర వధ అలంకారంలో అలంకరించారు. కనకదుర్గమ్మ మహాచండీదేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కనకాచలం కనకదుర్గమ్మ అమ్మవారు ఉత్సవమూర్తి ప్రత్యేక అలంకారంలో, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు కళిఅళగర్ పెరుమాళ్‌స్వామి అలంకారంలో, బంగారమ్మ అమ్మవారు, పొనగల్ గంగమ్మ ప్రత్యేక అలంకారం, ముత్యాలమ్మ మహాచండీదేవి అలంకారం, భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు లలిత త్రిపురసుందరి రూపంలో భక్తులకు దర్శనం కల్పించారు.

నారాయణవనంలో..

నారాయణవనం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం సాయంత్రం సముదాయంలోని టీటీడీ అనుబంధ అమ్మాయక్కమ్మ ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు ఊంజల్‌సేవలో దర్శనమిచ్చారు. టీటీడీ ఆలయాల ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు ఉత్సవాలను పర్యవేక్షించారు. కైలాసనాథకోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామి ఆలయంలో అమ్మవారు, తిరువట్యంలో మూలస్థాన ఎల్లమ్మ అమ్మవారు సరస్వతీ దేవిగా అలంకరించుకుని భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారు సాయంత్రం ఊంజల్‌సేవలో భక్తులకు దర్శనమిచ్చారు.

కాళికామాతగా చెంగాళమ్మ

వరదయ్యపాళెం: మండలంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరదయ్యపాళెంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు కాళికాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అంబూరులోని శ్రీకామాక్షమ్మ అమ్మవారి ఆలయంలో మహాచండీదేవిగా కామాక్షమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

కాళికాదేవిగా సర్వమంగళాదేవి

సత్యవేడు: శరన్నవరాత్రుల సందర్భంగా ఏడో రోజు సర్వమంగళాదేవి కాళికాదేవిగా దర్శనమిచ్చింది. ఆదివారం అమ్మవారిని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. భక్తులకు సాయంత్రం అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ధర్మకర్త రవికుమార్ దేవర్ భక్తులు పసుపు, కుంకుమ, తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.






వీణావాణిగా మూలస్థాన ఎల్లమ్మ, చెంగాళ పరమేశ్వరి అమ్మవారు, సరస్వతీదేవిగా కామాక్షాంబిక, అంబూరు కామాక్షమ్మ, పెరుమాళ్‌స్వామి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

ప్రమాదకరంగా వంతెన


కరుణానది వంతెన వద్ద కూలిన పిట్టగోడ


కరుణానది వంతెనపై మరోవైపు కూలిన పిట్టగోడ

వరదయ్యపాళెం: తడ–వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలోని కడూరు సమీపంలో ఉన్న కరుణానది వంతెనపై పిట్టగోడలు లేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెన నిర్మించిన సమయంలో నిర్మాణం చేసిన పిట్టగోడలు వంతెనకు ఇరువైపులా వాహనాలు ఢీకొనడంతో మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో నూతనంగా నిర్మించాల్సిన పిట్టగోడలను ఇప్పటిదాకా నిర్మాణం చేపట్టడం లేదు. దీని కారణంగా ఆ ప్రాంతంలో వాహనాలు అదుపు తప్పి అవతలి వైపు జారిపడే అవకాశం ఉంది. ఇటీవల ఓ లారీ ఆ ప్రాంతంలో అదుపు తప్పి ముందు చక్రాలు రెండూ అవతలి వైపు దూసుకెళ్లి ప్రమాదానికి గురైంది. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే పిట్టగోడలు నిర్మించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కేబుల్ గుంతలతో అవస్థలు


కాటూరు రోడ్డుపై గుంత


పదో మైలు గ్రామం వద్ద కేబుల్ గొయ్యి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని శ్రీకాళహస్తి–తడ వెంబడి ఉన్న ఓఎఫ్‌సీ కేబుల్ ఏర్పాటు కోసం తవ్విన గుంతలను పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వరదయ్యపాళెం నుంచి శ్రీకాళహస్తి వరకు 20కి పైగా గుంతలు రోడ్డు పక్కనే ఉన్నాయి. ఓఎఫ్‌సీ కేబుల్ గుంతలతో పాటు గుంతల నుంచి తీసిన మట్టి దిబ్బలుగా రోడ్డుపై ఉండడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. రోడ్డు పక్కనే ఉన్న గుంతలు వాహనదారులకు కనిపించకపోవడంతో గుంతలలోకి వాహనాలు దిగి పడిపోతున్నాయి. కేబుల్ కోసం గుంతలను 8 నెలలు కావస్తున్నా పూడ్చకుండా వదిలేశారు. మట్టి దిబ్బలు సైతం రోడ్డు పక్కనే ఉన్నాయి. పైపులైన్ గుంతలను పూడ్చకుండా, రోడ్డుపై మట్టి దిబ్బలు ఉన్నా, సంబంధితశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి శ్రీకాళహస్తి–తడ రోడ్డు వెంబడి ఉన్న ఓఎఫ్‌సీ కేబుల్ గుంతలను పూడ్చాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.